ఆంధ్రజ్యోతి


***

ANDHRAJYOTHY

నల్లగొండ

3

సోమవారం 8 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	190	210
సూర్యాపేట	రూ.110	155	177
నల్లగొండ	రూ.107	160	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 17.0



ముగ్గును పరిశీలిస్తున్న ఎస్పీ చందనా దీప్తి

ముగ్గులు తీర్చిదిద్దుతున్న మహిళలు



ప్రథమ బహుమతి అందజేస్తున్న ఎస్పీ చందనా దీప్తి, స్పాన్సర్ మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ పర్వతం అశోక్, 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు అరుణ, రమాదేవి

అవనిపై హరివిల్లు

ఉత్సాహంగా 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు

రంగు రంగుల రంగవల్లులు కనువిందు చేశాయి.. నింగి లోని చుక్కలు పుడమిని తాకి సప్తవర్ణశోభితంగా ముత్యాల ముగ్గులుగా ఒదిగాయి... సంక్రాంతి పండుగ వారం రోజుల ముందే వచ్చిందా అనే రీతిలో అబ్బురపరిచాయి. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా, సామాజిక అంశాలను మేళవిస్తూ మహిళలు వేసిన చుక్కల ముగ్గులు అలరించాయి.

\- నల్లగొండకల్చరల్

జిల్లాలో ఆదివారం నల్లగొండలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" మంత్రముగ్ధుల్ని చేశాయి. మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సహకారంతో నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల మైదానానికి ఉదయం 9గంటల నుంచే మహిళలు, యువతులు ముగ్గులు వేసేందుకు చేరుకున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రంగులతో వచ్చి పేర్లు నమోదు చేసుకున్నారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన ముగ్గుల పోటీ రెండు గంటల వ్యవధితో 12గంటలకు ముగిసింది. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, సంక్రాంతి పండగ ప్రతిబింబించేలా మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. చుక్కల ముగ్గులు వేసి, పలు రకాల రంగుల అద్ది, నవధాన్యాలను గురుగుల్లో నింపి ముగ్గులను అలంకరించారు. ముగ్గుల్లో భోగిమంటలు రంగరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సేవ్ చైల్డ్‌గర్ల్స్, పర్యావరణ పరిరక్షణ వంటి రకరకాల సామాజిక చైతన్య నినాదాలతో ముగ్గులు తీర్చిదిద్దారు. చేయూత, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను ముగ్గుల్లో చేర్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 103మంది మహిళలు వచ్చి ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని చక్కని రంగవల్లులతో మంత్ర ముగ్ధులను చేశారు.



ముగ్గులను పరిశీలిస్తున్న 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' సిబ్బంది

1





సంతోషంగా ఉంది: నాంపల్లి శ్రీలత, నల్లగొండ, ప్రథమ బహుమతి విజేత

వృత్తిరీత్యా బ్యూటీపార్లల్‌లో పని చేస్తున్నా. ముగ్గుల పోటీల్లో పాల్గొనడం అంటే నాకెంతో ఇష్టం. 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 15 ఏళ్లుగా పాల్గొంటున్నా. పాల్గొన్న ప్రతీసారి కన్సొలేషన్ బహుమతి వచ్చింది. ప్రథమ బహుమతి వస్తుందని ఊహించలేదు. ఈ సారి ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటా.



2



ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం

- మిర్యాల రూప, నకిరేకల్, ద్వితీయ బహుమతి విజేత

'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఇప్పటికే ఐదు సార్లు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నా. 2018లో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకొని, హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ ముగ్గుల పోటీలో పాల్గొన్న. 2019లో మూడు బహుమతులు గెలుచుకున్నా.



3



బహుమతి రావడం సంతోషంగా ఉంది..

- బొజ్జ క్రాంతి, నల్లగొండ, తృతీయ బహుమతి విజేత

ముగ్గుల పోటీల్లో బహుమతి గెలుచుకోవాలనే వచ్చా. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీలో పదేళ్లుగా పాల్గొంటున్నా. ఈ సారి తృతీయ బహుమతి గెలుచుకున్న. బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. ఎస్పీ నుంచి బహుమతి అందుకోవడం మరింత ఆనందాన్ని ఇచ్చింది.





రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌టీఎస్‌లు

ఇచ్చేదే సగం.. నెలలుగా పెండింగ్

9 నెలలుగా వేతనాలులేక ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఆందోళన

మిర్యాలగూడ, జనవరి7: చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్‌టీఎస్)కు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎఫ్‌టీఎస్ ఉద్యోగులుగా పరిగణించే ధరణి ఆపరేటర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మొదట్లో నెలనెలా వేతనాలు చెల్లించి రానురానూ రెండు మూడు నెలలకోసారి ఇస్తూ వచ్చారు. వచ్చేదే సగం, మిగతా సగం కంపెనీలే తీసుకుంటుండగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఎఫ్‌టీఎస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గత వారం ఫీల్డ్ టెక్నిక్ స్టాఫ్ కలెక్టర్లకు వినతిపత్రం అందజేయడంతోపాటు ఆదివారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి దేశ్యానాయక్‌ను కలిసి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని విన్నవించారు.

రికార్డుల నిర్వహణ కోసం

రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ నిర్వహణకు 2018 మే 23న రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకరిని చొప్పున 584 మంది ఎఫ్‌టీఎస్, వారికి తోడుగా 31 జిల్లాల్లో జిల్లా కోఆర్డినేటర్లతో కలిపి 713 మందిని నియమించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎల్అండ్ఎఫ్ఎస్) అనే కంపెనీ (ప్రస్తుతం టెరాసిస్)కు అవకాశం కల్పించింది. ఈ కంపెనీ సైట్ నిర్వహణతోపాటు వెబ్ డిజైనింగ్ పనులను నిర్వహిస్తూ ఉద్యోగుల నియామక బాధ్యతలను ఈసెంట్రిక్ (ప్రస్తుతం పారాడిగమ్ ఐటీ)అనే మరో కంపెనీకి అప్పగించింది. ఎఫ్‌టీఎస్‌లకు నెలకు రూ.11వేల చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది.

వేతనంలో సగం కోత

ఒక్కో ఎఫ్‌టీఎస్‌కు ప్రభుత్వం 2021 జూన్ వరకు ఐఎల్అండ్ఎఫ్ఎస్ కంపెనీ ద్వారా రూ. 18, 000చెల్లించగా, అదే ఏడాది జూలై నుంచి టెరాసిస్ కంపెనీ ద్వారా రూ.24,000 చెల్లిస్తుండగా, ఒక్కో ఉద్యోగి వేతనం నుంచి నెలకు రూ.5 వేల చొప్పున టెరాసిస్ కంపెనీ కోత విధిస్తోంది. మిగిలిన రూ.19,000 పారాడిగమ్‌ఐటీ కంపెనీ రూ. 3,000 కోత పెడుతోంది. మిగతా రూ.16,000లలో పీఎఫ్, ఈఎస్ఐ పోగా నికరంగా ఒక్కో ఎఫ్‌టీఎస్ ఉద్యోగికి రూ.11,000 వేతనంగా అందుతోంది. కాగా వీటిని తొమ్మిది నెలలుగా సదరు కంపెనీలు చెల్లించకపోవడంతో ఎఫ్‌టీఎస్‌ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. వేతనాల కోసం ఎవరిని అడగాలో తెలియక రాష్ట్రంలోని 713 మంది ఉద్యోగులు తల్లడిల్లుతున్నారు.

వేతనం తక్కువ.. పని ఎక్కువ

వెబ్‌ల్యాండ్ స్థానంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి సైట్‌ను తీసుకొచ్చింది. మండలాల వారీగా రైతులకు ఈ వెబ్‌సైట్ ద్వారా సేవలందించేందుకు ఎఫ్‌టీఎస్ ఉద్యోగులకు నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ఉదయం 9గంటలకు మండల కార్యాలయంలోకి ఎఫ్‌టీఎస్ ఉద్యోగి అడుగు పెడితే బయటకొచ్చేదెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి రాత్రి 10గంటల వరకు విధులు నిర్వహించాల్సి వచ్చింది. సర్వే నెంబర్ల వారీగా రైతుల వేలిముద్రల సేకరణ, సైట్‌లో వివరాలు పొందుపర్చడం వంటి పనులలో ఎఫ్‌టీఎస్ ఉద్యోగులు తీరిక లేకుండా విధులు నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్ విధులను ప్రభుత్వం తహసీల్దార్లకు బదిలీ చేయడంతో వీరిపై మరింత పనిభారం, ఒత్తిడి కూడా పెరిగింది. రోజుకు 12గంటలకు పైగా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నా రూ.11,000 వేతనం మాత్రమే అందుతోంది. జీవో 63, 2021 ప్రకారం వేతనాలను రూ.31,000కు పెంచాలని డిమాండ్ చేస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారి వాపోతున్నారు. నల్లగొండ జిల్లాలో 36 మంది, సూర్యాపేట జిల్లాలో 26మంది, యాదాద్రి జిల్లాలో 19మంది, మొత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81 మంది ధరణి ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. కంపెనీలు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొంది.

మళ్లీ తెరపైకి కాసారం మైనింగ్ వివాదం

తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని గ్రామస్తుల వినతి

దేవరకొండ, జనవరి 7: మండలంలోని కాసారం గ్రామ శివారులో సర్వేనెంబర్ 13లో 24.7హెక్టార్ల ప్రభుత్వ భూమిలో మైనింగ్ తవ్వకాల విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. నవభారత్ క్వారీ మైనింగ్ కంపెనీ ఇక్కడ తవ్వకాలకు అనుమతుల కోసం గతంలో దరఖాస్తు చేసుకుంది. అయితే తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని గ్రామస్థులు, పర్యావరణవేత్తలు, మానవహక్కుల వేదిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నినదించారు. గతంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ తవ్వకాలను గ్రామస్థులు వ్యతిరేకించారు.తవ్వకాలకు అనుమతులు ఇస్తే రైతులకు ఇబ్బందులు కలుగుతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దని ఈ నెల 6న కాసారం గ్రామస్థులు దేవరకొండ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. క్వారీ తవ్వకాలతో గ్రామానికి తీవ్ర నష్టం జరుగుతుందని అనుమతులు ఇవ్వొద్దని కాసారం గ్రామానికి చెందిన న్యాయవాది నిరసనమెంట్ల సుందరయ్యతో పాటు, గ్రామస్థులు కోరారు. కాగా, నవభారత్ క్వారీ మైనింగ్ ప్రతినిధులు మాత్రం అనుమతుల కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై దేవరకొండ ఆర్డీవో శ్రీరాములును వివరణ కోరగా కాసారంలో క్వారీ మైనింగ్ విషయం తన దృష్టికి రాలేదన్నారు.




మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు


ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ రూరల్, జనవరి 7: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక మగ్దుం భవనంలో జరిగిన సంఘం రీజియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఎంప్లాయిస్ యూనియన్ అండగా నిలిచి పోరాడుతోందన్నారు. ఆర్టీసీ కార్మికుల పీఆర్సీ, డీఏ, ఎరియర్స్, సీసీఎస్, పీఎఫ్‌లు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కార్మికులంతా హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అదే విధంగా ఆర్టీలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ గౌడ్, సంఘం నాయకులు మంగ, వెంకటయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
పివిఆర్ ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
పివిఆర్ ఇన్ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
పివిఆర్ ప్రెస్టన్ మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
పివిఆర్ అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
పివిఆర్ ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఐనాక్స్ జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఐనాక్స్ ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
ఐనాక్స్ జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
ఐనాక్స్ నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
ఐనాక్స్ అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
సినీపోలిస్ మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సినీపోలిస్ సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
సినీపోలిస్ మంత్రామాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సినీపోలిస్ సుధా - శాలిబండ	మరియు
సినీపోలిస్ డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
పివిఆర్ ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
పివిఆర్ ఇన్ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
పివిఆర్ ప్రెస్టన్ మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
పివిఆర్ అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
పివిఆర్ ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఐనాక్స్ జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఐనాక్స్ ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
ఐనాక్స్ జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
ఐనాక్స్ నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
ఐనాక్స్ అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
సినీపోలిస్ మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సినీపోలిస్ సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
సినీపోలిస్ మంత్రామాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సినీపోలిస్ సుధా - శాలిబండ	మరియు
సినీపోలిస్ డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

రాష్ట్ర సరిహద్దులో ముమ్మర తనిఖీలు



రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కోదాడ రూరల్, జనవరి 7: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు చెక్ పోస్టు వద్ద ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చే వాహనాలను తెలంగాణ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి ఎస్ఐ మల్లేశ్ తెలిపారు. తెలంగాణలోకి ఆంధ్రప్రదేశ్ నుంచి చెక్‌పోస్టుల మీదుగా హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఎన్ని వాహనాలు తనిఖీ చేశామనే వివరాలు జిల్లా హెడ్‌క్వార్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే తనిఖీలు నిర్వహించిన వాహనాల నెంబర్లను నమోదు చేసుకుంటున్నట్లు వివరించారు.

మహిళ అదృశ్యంపై కేసు



మల్లిక

హుజూర్‌నగర్, జనవరి 7: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బాణోతు మల్లిక అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలో బాణోతు యాకూ, అతని భార్య మల్లికలు నివసిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మల్లిక కనిపించకుండా పోయింది. ఉదయం లేచి చూడగానే ఇంట్లో లేకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితంలేదని భర్త తెలిపాడు. ప్రస్తుతం 16నెలల కుమారుడు ఉన్నాడు. కాగా మల్లిక ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. ఈ మేరకు భర్త యాకూ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండుగకు వెళుతుండగా ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి ● కుమారుడికి తీవ్రగాయాలు
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో విషాదఛాయలు



సీతమ్మ(ఫైల్)

నేరేడుచర్ల, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన మంత్రిప్రగడ సీతమ్మ(56), ఆమె కుమారుడు సీతారాం(30)తో కలిసి ప్రగతి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్న సీతమ్మ కుమార్తె కీర్తి, అల్లుడు సునీల్‌లు సంక్రాంతికి ఆహ్వానించడంతో పిండి వంటలు తీసుకొని శనివారం రాత్రి తిరుపతి వెళ్తున్న మిర్యాలగూడడిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. తెల్లవారుజామున నెల్లూరు జిల్లా గూడూరు మండలం ముంచెర్ల జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు వెనుక సీటులో ఉన్న సీతమ్మ, కుమారుడు సీతారాంలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం సమీపంలోని కావలి ఆస్పత్రికి తరలించగా, సీతమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. సీతారం పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. సీతారాంకు వివాహం కాలేదు. సీతమ్మ భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందడంతో సీతమ్మ, ఆమె కుమారుడు ఇద్దరు నేరేడుచర్లలో నివాసం ఉంటున్నారు. విషయం తెలియడంతో నేరేడుచర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె అంత్యక్రియలు నెల్లూరులోని కుమార్తె ఇంటి వద్దే చేయనున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



భాస్కర్(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, జనవరి7: ఆర్థిక ఇబ్బందులకు తోడు, మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన భాషిపాక భాస్కర్(45) వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూలేని సమయంలో వరండాలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాస్కర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. భాస్కర్ కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరినాట్లు వేసి వస్తుండగా ఆటో బోల్తా

- 13 మంది కూలీలకు గాయాలు
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ఘటన



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు

చిట్యాల రూరల్, జనవరి 7: వరినాట్లు వేసి వస్తున్న ఆటో బోల్తాపడడంతో 13 మంది కూలీలకు గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాంపల్లికి చెందిన మహిళలు, యువతులు వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామశివారులో ఓ రైతు పొలంలో వరినాట్లు వేసి సాయంత్రం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. గుండ్రాంపల్లి శివారులోని జేబీ వెంచర్ సమీపంలో గల జింకల సర్కిల్ ప్రాంతంలో ఆటో అజాగ్రత్తగా నడపడంతో రోడ్డు పక్కన బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు దివ్య, బత్తుల అండాలు, అనసూయ, అనిత, విజయ, పద్మ, భవాని, అంజమ్మలతో పాటు మరికొంతమందికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు గాయపడిన వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో దివ్య, అండాలుకు తీవ్రగాయాలుకావడంతో హైదరాబాద్ తరలించారు. భవాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అండర్-14 క్రికెట్‌లో ప్రథమ బహుమతి



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో నారాయణరెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 7: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ టోర్నీలో యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ చూపి ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, విఘ్నేష్, మణికంఠ, ఆవేజ్ అలీ, రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. ఈమేరకు డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.స్టాలిన్‌బాబు, గణేష్, క్రికెట్ అకాడమీ, వ్యవస్థాపకులు ఏవీ గండేశ్వర్‌రావు, కోచ్ వినయ్ సింగ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ కె.స్టాలిన్, బాబు, తదితరులున్నారు.

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి

● మూడు ముళ్లతో ఒక్కటైన జంట ● ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జనవరి 7: లండన్ అమ్మాయి.. ఇండియా అబ్బాయి మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహానికి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణం వేదికైంది. చౌటుప్పల్‌కు చెందిన రైతు, సీపీఐ పట్టణ కార్యదర్శి మోహన్‌రెడ్డి కుమారుడు పగిళ్ల హేమంత్‌రెడ్డి ఉన్నత చదువు నిమిత్తం నాలుగేళ్ల క్రితం లండన్ వెళ్లారు. అక్కడే ఉద్యోగం చేస్తున్న హేమంత్‌రెడ్డికి లండన్‌కు చెందిన యువతి హార్లీతో పరిచయమైంది. ప్రేమించుకున్న వారు వివాహ బంధంతో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. పెద్దల అంగీకారంతో హేమంత్‌రెడ్డి స్వగ్రామంలో తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఆదివారం హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. హార్లీ తరుపున లండన్ నుంచి తమ్ముడు వివాహానికి హాజరయ్యాడు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిణి నారాయణరావు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పర్యాటక కేంద్రంగా మారేనా?

» గుర్తింపునకు నోచని వాడపల్లి పర్యాటక ప్రాంతం
» రైల్వేస్టేషన్ పునరుద్ధరణపై అస్పష్టత
» అభివృద్ధి చేయాలని దామరచర్లవాసుల విజ్ఞప్తి



వాడపల్లి కృష్ణా, మూసీ సంగమ ప్రదేశం



శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి

వాడపల్లి సంగమం, శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతో పాటు పలు సిమెంట్ ఫ్యాక్టరీలతో దామరచర్ల ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న దామరచర్ల మండలంలో పలు సమస్యలు ఏళ్ల తరబడి తిష్టవేసి ఉన్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికంగా గుర్తింపు పొందినా సమస్యలు మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోడం లేదు. మండలంలో సౌకర్యాలు కల్పించి పర్యాటక కేంద్రంగా మార్చడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– దామరచర్ల

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచింది. కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రదేశంలో సుమారు 600 ఏళ్ల క్రితం రెడ్డిరాజుల కాలంలో నిర్మించిన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. అగస్త్యేశ్వరాలయంలోని శివలింగం పైభాగం నుంచి నిరంతరం ఉద్భవిస్తున్న గంగాజలం, లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ ఎదురుగా ఉన్న రెండు ప్రమిదల్లో పైభాగంలోని ఉన్న ప్రమిద కదులుతుండగా కింది భాగంలో ఉన్న ప్రమిద నిశ్చలంగా ఉంటుంది. స్వామివారి ఉచ్ఛ్వాస, నిశ్వాస కారణంగా పైన ఉన్న ప్రమిద కదులుతుందని భక్తుల నమ్మకం. ఆలయాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కాకతీయుల కాలంలో నిర్మించిన కోటలు, కోట గోడలు, పలు పురాతన ఆలయాలు శిథిలావస్థలో నేటికి దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా ఈ ప్రాంతంలో నిజాం మేనల్లుడు వజీర్ సుల్తాన్ నిర్మించిన ఎన్నో కట్టడాలు ఇక్కడ నెలవై ఉన్నాయి. ప్రధానంగా సంగమ ప్రదేశంలో ఆహ్లాద వాతావరణం ఉంటుంది. ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గత రెండు దశాబ్దాలుగా పలువురు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి

పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న మండలకేంద్రంలో రైళ్లు నిలుపదల లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదాయం సమకూరడం లేదనే కారణంతో రెండు దశాబ్దాల క్రితం రైల్వేస్టేషన్‌ను మూసివేశారు. రైల్వేస్టేషన్‌ను తిరిగి పునరుద్ధరిస్తే నిత్యం వందల సంఖ్యలో స్థానికులతోపాటు పరిశ్రమల్లో పనిచేసే వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ప్రయాణించే వీలుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రామాలయ నిర్మాణంతో సనాతన ధర్మ పరిరక్షణ

● మాజీ డీఎస్పీ నళిని

భువనగిరి టౌన్, జనవరి 7: అయోధ్యలో రామాలయ నిర్మాణంతో సనాతన ధర్మ పరిరక్షణకు కలిసి వస్తుందని మాజీ డీఎస్పీ దొమకొండ నళిని అన్నారు. విశ్వహిందూ పరిషత్ బృందం ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఆమెను కలిసి అయోధ్య రాముడి అక్షింతలు, ఆలయ ప్రారంభోత్సవం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ హిందువు అయోధ్య ఆలయాన్ని సందర్శించాలన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో భక్తుల సందడి

● స్వామి ధర్మదర్శనాలకు 3గంటలు..ప్రత్యేక దర్శనాలకు గంట సమయం ● ఏకాదశి లక్షపుష్పార్చనలు..తిరుప్పావై వ్రతారాధనలు ● స్వామికి పూల బుట్ట బహూకరణ



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, లక్ష పుష్పార్చనలు పూజలు నిర్వహించిన అర్చకులు



యాదగిరిగుట్ట, జనవరి7: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కొండగుహలో కొలువైన స్వయంభువుల దర్శనాలు.. ఆర్జిత సేవల నిర్వహణకోసం వారాంతపు సెలవురోజు కావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన భక్తులు ఇష్టదైవాల నామస్మరణలతో ప్రధానాలయం, తిరువీధులు మారుమోగాయి. స్వామి వారి ధర్మదర్శనాలకు మూడు గంటలు, ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని, సుమారు 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దేవదేవుడి దర్శనాలకోసం విచ్చేసిన భక్తులతో కొండకింద కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్‌లు.. కొండపైన ఆలయ తిరువీధులు, దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. దర్శనానంతరం ప్రధానాలయ తిరువీధుల్లో, ఘాట్‌రోడ్, పుష్కరిణి, వ్రత మండపం వద్ద గల గ్రీనరీ, పెద్దగుట్టపైన, రాయిగిరి చెరువు ప్రాంతంలోని గార్డెన్‌లలో భక్తులు సేదతీరారు. అనుబంధ పాతగుట్టలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.43,61,283 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.

ఏకాదశి లక్షపుష్పార్చనలు..

యాదగిరీశుడి సన్నిధిలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్షపుష్పార్చన పూజలు, తిరుప్పావై వ్రతారాధనలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యపూజలు ఆరంభించిన అర్చకులు గర్భగుడిలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేద మంత్ర పఠనాలతో అభిషేకించి అర్చించారు. ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు స్వర్ణసింహాసనంపై అధిష్ఠింపజేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్ల సహస్రనామాలతో లక్షపుష్పార్చన పూజలు చేశారు. ముందుగా ప్రభాతవేళ ఉత్తరదిశలోని మొదటి ప్రాకార మండపంలో తిరుప్పావై పాశుర పఠనాలతో ధనుర్మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. యాదగిరీశుడికి సుమారు కిలో వెండితో తయారు చేసిన పూలబుట్టను ఆదివారం హైదరాబాద్ ఒమేగా హాస్పటల్ ప్రతినిధి టి శ్రీకాంతారావు బహూకరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు డి.సురేందర్‌రెడ్డి, ఉపప్రధానార్చకులు కొడకండ్ల మాధవాచార్యులు తదితరులున్నారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరీశుడిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. స్వామిని కర్ణాటక రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి తరుణ ప్రకాష్ రుద్రప్ప పాటిల్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డిలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రధానాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజలనంతరం అర్చకులు వీరికి ఆశీర్వచనం నిర్వహించగా.. దేవస్థాన అధికారులు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

కృష్ణా బ్యాక్ వాటర్‌పై దృష్టి పెట్టాలి

● ఆయకట్టు చివరి భూములకు నీరందించాలి ● లిఫ్టుల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
● అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు ● అధికారులతో సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 7: కృష్ణా నది బ్యాక్ వాటర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో హుజూర్‌నగర్ ప్రాంతంలోని నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలపై అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కృష్ణా పరివాహక ప్రాంతం ఉన్నందున హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అవసరమైన కృష్ణానీటిని ఉపయోగించుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. లిఫ్టుల నిర్మాణం, కాల్వ చివరి భూములకు నీరందించడం కోసం చెరువులను డిజైన్ చేయాలన్నారు. కృష్ణా నీటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో నీటిని ఉపయోగించుకునేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 34 లిఫ్టులు, కోదాడలోని లిఫ్టులను పునరుద్ధరించాలన్నారు. రెండు లిఫ్టులకు కలిపి ఒక అధికారిని కన్వీనర్‌గా నియమించాలని ఆదేశాలు జారీచేశారు. లిఫ్టుల నిర్వహణలో ఎంతో కీలకంగా వ్యవహరించాలన్నారు. మహంకాళిగూడెం, నక్కగూడెం, దొండపాడు, అమరవరం, మేడారం, తుమ్మల తండా తదితర లిఫ్టులన్నీ పరిశీలించాలన్నారు. రామచంద్రాపురం, పెదవీడు లిఫ్టులు నడవడం లేదని, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని, బ్యాటరీలు అలంకార ప్రాయంగా మారాయన్నారు. వాటిని అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. వేములూరు ప్రాజెక్ట్ ఆధునీకరణకు రూ.9కోట్లు మంజూరు చేసినా పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని సమావేశంలో రైతులు వెల్లడించారు. చెన్నాయిపాలెం దాకా నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అధికారులు అందుబాటులో ఉండి పనులు పూర్తిచేయాలన్నారు. ఎన్నెస్పీ కాల్వలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. చెరువులు, కుంటలు, నీటిబందాలు, జాలు కాల్వలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఈ రమేష్‌బాబు, ఈఈ శ్రీనివాసరావు, స్వామి, భిక్షం, తుమ్మల శ్రీనివాస్, పవన్‌కుమార్, ఈఈ వెంకటయ్య, డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సాముల శివారెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, గెల్లి రవి, భూక్యా గోపాల్, మంజూనాయక్, కొట్టె పద్మసైదేశ్వరరావు, దొంగరి వెంకటేశ్వర్లు, పెండెం సుజాతశ్రీను, గోవిందరెడ్డి, రాపోలు నర్సయ్య, మోతీలాల్, కొణతం వెంకటరెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సైదులు, వీరారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను కాపాడాలని వినతి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌తోపాటు శ్రీశైలం, జూరాల, కోయిల్‌సాగర్ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులను కాపాడాలని తెలంగాణ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్‌రావు, ఇంజనీరింగ్ విభాగం మెయింటనెన్స్ ప్రాజెక్ట్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి వెంకట్ ఆదివారం మంత్రి ఉత్తమ్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుల్లో రెండు దశాబ్దాలుగా ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో సిబ్బంది కొరత ఉందని, దీంతో ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టులకు సిబ్బందిని నియమిస్తామని హామీలు ఇచ్చిన గత ప్రభుత్వాలు నియమించలేదని తెలిపారు. నీటి పారుదల శాఖ విభాగంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో నీరు వృథా అవుతుందన్నారు. స్పందించిన మంత్రి ఈఎన్‌సీతో మాట్లాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సంక్రాంతిని ప్రతిబింబించిన ముగ్గులు

● ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ కల్చరల్, జనవరి 7: సంక్రాంతి సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మహిళలు ముగ్గులను ప్రదర్శించడం అభినందనీయమని ఎస్పీ చందనాదీప్తి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలు కళాత్మకమైన ముగ్గులను ప్రదర్శించి ప్రతిభను నిరూపిస్తున్నాయని అన్నారు. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి బహుమతులను అందజేయడం గొప్ప విషయమని అన్నారు. మున్ముందు కూడా ఈ సంస్కృతిని కొనసాగించాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ముగ్గులను పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్

ముత్యాల ముగ్గుల పోటీలను ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించి మహిళలు ప్రదర్శించిన సంక్రాంతి ముగ్గులను పరిశీలించారు. ప్రతి ఏడు 'ఆంధ్రజ్యోతి' మహిళల కోసం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖరరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో 17 సంవత్సరాలుగా రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలనే లక్ష్యంతో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యూరో ఇన్‌చార్జి మారబోయిన మధుసూదన్ మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించాలని, సంక్రాంతి సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశ్యంతోనే కొన్ని సంవత్సరాల నుంచి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తుందని అన్నారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విజేతను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పర్వతం అశోక్, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ అందోజు కృష్ణమాచారి, సర్క్యులేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ రవికుమార్, పీసీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, సబ్ ఎడిటర్లు రాజు, అజీజ్, ప్రవీణ్‌కుమార్, ఎల్లేశ్వర్, నాగరాజు, రిపోర్టర్లు చంద్రశేఖర్, రాములు, గిరి, గిరిప్రసాద్, సిబ్బంది శ్రీకాంత్, ఉపేందర్, పరమేష్, చిరంజీవి, మహేష్, కృష్ణ, భాస్కర్, ఫొటో, వీడియోగ్రాఫర్లు విజయ్, మల్లికార్జున్ యాదవ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఈ కుమార్తెకు ముగ్గులను చూపిస్తున్న ఎస్పీ చందనాదీప్తి


ముగ్గు తీర్చిదిద్దిన మహిళకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్


ఎస్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు






ముగ్గులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ దంపతులు


ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్పీ చందనాదీప్తి, స్పాన్సర్ పర్వతం అశోక్


పోటీల్లో ఆకట్టుకున్న ముగ్గులు


రంగులు అద్దుతున్న యువతులు


ముత్యాల ముగ్గు పోటీల్లో ముగ్గులు వేస్తున్న యువతులు






బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఎం చంద్రశేఖరరావు, హాజరైన మహిళలు


పోటీల్లో పాల్గొనే మహిళల పేర్లు నమోదు చేస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది, కన్సోలేషన్ బహుమతుల అందజేత


ముగ్గు వేస్తున్న తల్లిని ఫొటో తీస్తున్న కుమారుడు

పూర్వ విద్యార్థులకు 'స్వాన్' అండగా నిలవాలి

నార్కట్‌పల్లి, జనవరి 7: ఆపన్నహస్తం కోసం ఎదురుచూసే సహ, పూర్వ విద్యార్థులకు స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నార్కట్‌పల్లి) సంస్థ అండగా నిలవాలని వక్తలు అభిలషించారు. సంస్థలో సభ్యత్వం ఉన్న సభ్యుల చేయూతతో స్వాన్ సేవలు మరింత విస్తృతం చేయాలని వారు ఆకాంక్షించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో స్వాన్ సర్వసభ్య సమావేశం, నార్కట్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో అన్ని బ్యాచ్‌ల పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఉపాధ్యాయుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులుగా కేవలం ఒకరోజు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికే పరిమితం కాకుండా అందరూ కలిసి సంస్థగా ఏర్పడి ఆపదలో ఉన్న తోటి విద్యార్థులకు చేదోడుగా నిలవాలని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విష్ణు దంపతుల ఇద్దరు పిల్లలకు ఒకొక్కరికి రూ.లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను అందజేశారు. అదేవిధంగా ఆదిమల్ల లోకేష్ చెల్లెలు చదువు నిమిత్తం రూ.50వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వాన్ వ్యవస్థాపకుడు మామిండ్ల సత్తిరెడ్డి, దుశర్ల సత్యనారాయణ, వందేమాతరం ఫెడరేషన్ అధ్యక్షుడు రవీందర్, వనం మహేష్, వనజాత, పృథ్వీరాణి, ఉదయశ్రీ, యాదగిరిరెడ్డి, 1995 నుంచి 2018 వరకు గల అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, జనవరి 7: నల్లగొండ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చందనదీప్తిని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపి పలు విషయాలను చర్చించారు. ఆయన వెంట ప్రసాద్ ఉన్నారు.


ఎస్పీ చందనాదీప్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి శుభాకాంక్షలు

నాగార్జునసాగర్: హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఆదివారం సాగర్ హిల్‌కాలనీలో ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను ఇచ్చి, శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె వెంట 7వ వార్డు కౌన్సిలర్ నిమ్మల ఇందిర, కొండయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే జైవీర్‌కు అయోధ్య అక్షింతల అందజేత

హాలియా: అయోధ్య రామమందిరం ప్రారంభం సందర్భంగా వచ్చిన పవిత్రమైన అక్షింతలను హాలియా రామాలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డికి అందజేశారు. గడపగడపకూ పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి మేళతాళాలతో, మహిళా భక్తుల నడుమ అక్షింతలను అందజేశారు. అనంతరం జానారెడ్డి, జైవీర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మైనార్టీ గురుకుల వ్యవస్థను ఒకే గొడుకు కిందకు తీసుకురావాలి

నల్లగొండ, జనవరి 7: మైనార్టీ గురుకుల వ్యవస్థ, ఇతర సొసైటీలను ఒకే గొడుకు కిందకు తీసుకరావాలని మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీలు భవిష్యత్తు కార్యక్రమాలు వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మైనార్టీ గురుకుల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు మహేష్, నర్సింహ, భరత్, జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా, అమిత్‌రెడ్డి

మహిళలు స్వశక్తితో ఎదగాలి

● మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 7: మహిళలు స్వశక్తితో ఎదగాలనే సంకల్పం గొప్పదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి మాతృశ్రీ సంస్థలో టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారితకు పెద్దపీట వేసేందుకు గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్లు యామ కవితదయాకర్, అభిమన్యు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఐతగోని స్వామిగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, ఇంద్రసేనారెడ్డి, జగన్మోహన్‌రావు, పరమేష్, మాతృశ్రీ, జననీ శిక్షణ సంస్థల ఆర్గనైజర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆట మెళకువలతో నేర్చుకోవాలి

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 7: ఆటలో మెళకువలు నేర్చుకుంటే పోటీల్లో విజేతగా నిలుస్తారని తైక్వాండో పోటీల చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ జి. విష్ణు అన్నారు. జిల్లా కేంద్రంలోని విన్నర్స్ వరల్డ్ తైక్వాండో అకాడమీలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో కలర్ ప్రమోషన్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ రోజు సాధన చేసినప్పుడే ఆటలో అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. తెలంగాణ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అనంతరం జరిగిన కలర్ బెల్టుల పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వివిధ రకాల బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్లు సురేష్, శ్రీరామ్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాస్టర్ ఎండీ యూనుస్ కమాల్, సీనియర్ క్రీడాకారులు సరయు, శ్రేష్ఠ, అక్షయ, ముహీత్, నవాజ్, అభిరామ్, సాధ్ తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీల్లో బెల్టులు గెలుచుకున్న క్రీడాకారులు

కేఎన్ఎం డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

● కళాశాల అభివృద్ధికి రూ.30వేల విరాళం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న కేఎన్ఎం కళాశాల విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 7: కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో బీఏ (ఈహెచ్‌పీ) విద్యాభ్యాసం చేసిన 1994-97 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో అపూర్వసమ్మేళనం నిర్వహించుకున్నారు. చదువుకున్న రోజుల్లోని మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. 27 ఏళ్ల గడిచిన తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు వర్తమాన, జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని కళాశాల సమయంలో మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం తమ వంతుపాత్రగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఇదేబ్యాచ్‌కు చెందిన సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ డి.దేవూజీ కళాశాల అభివృద్ధి కోసం రూ.30వేల నగదును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాంరెడ్డికి విరాళంగా అందజేశారు. అనంతరం మాజీ ప్రిన్సిపాల్ యాదగిరిరెడ్డి, అధ్యాపకులు కోటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, చంద్రయ్య, రాజేశ్వరి, శ్రీనివాసచారిలను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు టి.లక్ష్మీనారాయణ, జి.సుందర్, సాంబశివ, శ్రీనివాస్, దశరథనాయక్, హరి, సైదిరెడ్డి, రాంరెడ్డి, అరవింద్, కోట్యానాయక్, వెంకటేశ్వర్లు, కోటి, సురేందర్‌రెడ్డి, సరిమళ, వెంకటమ్మ, ధనలక్ష్మి, సుప్రియ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

దామరచర్ల, జనవరి 7: మండలంలోని కొండ్రపోల్ గ్రామంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఉన్న మైసమ్మ తల్లి ఆలయం వద్ద బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పగిడి జీడయ్యయాదవ్ సుమారు రూ.1లక్ష వ్యయంతో నిర్మించిన భారీ హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోరిన కోర్కెలను తీర్చే బంగారుతల్లి గుంటూరు మైసమ్మ తల్లి అని కొనియాడారు. భక్తుల అభ్యర్థన మేరకు ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం జీడయ్యయాదవ్‌ను అభినందించి శాలువాలతో సన్మానించారు. మైసమ్మతల్లి ఆలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, సర్పంచ్ పరంగి రాంబాబు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కొమ్ము దాసు, గాలం వెంకన్నయాదవ్, నెత్తికొప్పుల పాపయ్య, ఖాదర్, జాని, మాలునాయక్, వెంకట్‌రెడ్డి, అంజయ్య, రమేష్, సైదయ్య, శ్రీను, కనకారెడ్డి, జానయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: అనుముల మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

నార్కట్‌పల్లి: టీఎస్ యూటీఎఫ్ నార్కట్‌పల్లి మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శి కె.వెంకన్న, ఉపాధ్యక్షులు ఎస్.పద్మ, జి.ఆదినారాయణ, కోశాధికారి నర్రా రవీందర్‌రెడ్డి, ఎఫ్ఎఫ్ కన్వీనర్‌గా ఆదినారాయణ ఎన్నికయ్యారు.

మిర్యాలగూడ టౌన్: బీసీ సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎర్రబెల్లి దుర్గయ్యను నియమించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలను కులాలకతీతంగా ఏకం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆశ్రమ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్ కోరారు. తల్లిదండ్రులు లేని అనాథలకు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం విశ్వాస పరిచర్య చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమాలలో రమాదేవి, జనార్ధన్, సుధారాణి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు: చండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పల్లె కల్యాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాకూబ్‌నాయక్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

డిండి: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు తెలిపారు. శేషాయికుంటలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం, టి.గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామంజనేయస్వామి ఆలయ ద్వారపూజ కార్యక్రమం, డిండి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభం, మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

నార్కట్‌పల్లి: ఉదయసముద్రం, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలను పూర్తిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశంను సీపీఎం మండల నాయకులు కోరారు. నకిరేకల్‌లో ఆయన నివాసంలో ఆదివారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎల్లారెడ్డిగూడెంలోని సర్వేనెంబర్ 280లో ఉన్న దేవస్థానం భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కింద ఇప్పించాలని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శ్రీరామోజు వెంకటేశ్వర్లు, వైస్ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, పెద్దులు, యాదమ్మ, రవి ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షమయ్య అన్నారు. జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన కళాశాల విద్యార్థి మహేష్‌ను అధ్యాపకులతో కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సైనికుల్లా పని చేయడం అభినందనీయమన్నారు. తమ విద్యార్థిని ఎంపిక చేసిన ఎంజీయూ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, కోటయ్య, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని పగిడిమర్రి గ్రామంలో ఆదివారం కనగల్ లయన్స్‌క్లబ్, శేఖర్ ఇనిస్టిట్యూట్, సత్యసాయి యోగా సేవాకేంద్రం, నల్లగొండ సంరక్ష ఆస్పత్రి సంయుక్తంగా మెగావైద్య శిబిరం, విద్యార్థులకు యోగా, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 150మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించిన మందులను పంపిణీ చేశారు.

చిట్యాల రూరల్: క్రికెట్ పోటీలకు చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన యువకుడు పాకాల మధు ఎంపికయ్యాడు. అండర్ 23లో యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ పోటీల్లో నోయిడాలో జరిగే పోటీల్లో ఆడేందుకు ఎంపికయ్యాడు. మధు ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాద పూర్వకంగా కలిశారు. క్రికెట్ పోటీలకు ఎంపికైనందున మధును ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం తరఫున ఆడేందుకు అవకాశం రావడం అభినందనీయమని అన్నారు.

శాలిగౌరారం: మండలంలోని గురజాల గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నకిరేకల్ మాజీ సమితి అధ్యక్షుడు ఎంసీపీఐ(యు) ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకుడు పన్నికర లింగయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా స్తూపం, విగ్రహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. లింగయ్య సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు కిరణ్‌కుమార్ రెడ్డి, వెంకన్న, మట్టయ్య, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, జనవరి 7: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. కొంతమంది భక్తులు బోనాలతో వచ్చి ఇష్టదైవానికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేసారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కనగల్, జనవరి 7: మండలంలోని ఎస్‌లింగోటం (మైలారం) గ్రామానికి చెందిన రైతు మండలి గంగయ్యకు చెందిన పాడి గేదె ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... రోజువారీగా తన గేదెను ఇంటి ఆవరణలో కట్టివేశాడు. ఆదివారం తెల్లవారుజామున తాడు తెంచుకుని మేత కోసం సమీపంలోని పొలంలోకి వెళ్లింది. పొలంలో ఉన్న విద్యుత్ సర్వీస్ వైరు గేదెకు తగలటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందింది. అనంతరం విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. గేదెను రెండు నెలల క్రితమే రూ.65 వేలకు కొనుగోలు చేసినట్లు రైతు గంగయ్య వాపోయాడు.